అక్షర్ పటేల్‌కే పట్టం

ఢిల్లీ క్యాపిటల్స్ సారథిగా నియామకం

ఢిల్లీ: మరో ఏడు రోజుల్లో మొదలుకాబోయే ఐపీఎల్-18వ సీజన్‌కు గాను ఢిల్లీ క్యాపిటల్స్ తమ సారథిగా టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను నియమించింది. కేఎల్ రాహుల్, ఫాఫ్ డుప్లెసిస్ వంటి అనుభవజ్ఞులు జట్టులో ఉన్నప్పటికీ క్యాపిటల్స్ యాజమాన్యం మాత్రం అక్షర్‌కే పట్టం కట్టింది. 2019 సీజన్ నుంచి ఢిల్లీకి ఆడుతున్న అక్షర్.. ఆరు సీజన్లలో 82 మ్యాచ్‌లు ఆడి 967 పరుగులు చేయడమే గాక 62 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ వేలానికి ముందు జట్లు అట్టిపెట్టుకున్న ఆటగాళ్లలో అక్షర్‌ను ఢిల్లీ.. రిషభ్ పంత్‌ను వదిలేసి మరీ టాప్ రిటెన్షన్ కింద రూ. 16.50 కోట్లతో రిటైన్ చేసుకున్నప్పుడే ఈ సీజన్‌లో అతడు సారథిగా ఉంటాడన్న వార్తలు వచ్చాయి. అయితే వేలంలో ఆ జట్టు రాహుల్, డుప్లెసిస్‌ను దక్కించుకోవడంతో వారికి ఆ అవకాశం దక్కొచ్చన్న గుసగుసలు వినిపించాయి. కానీ రాహుల్ మాత్రం తనకు కెప్టెన్సీ వద్దని, ఆటగాడిగా కొనసాగుతానని మేనేజ్‌మెంట్‌కు తేల్చిచెప్పడంతో అక్షర్‌కు లైన్ క్లియర్ అయింది. ఐపీఎల్‌లో కెప్టెన్సీ అనుభవం లేకపోయినా అక్షర్.. దేశవాళీ క్రికెట్‌లో గుజరాత్‌ను సయ్యిద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పాటు విజయ్ హజారే ట్రోఫీల లోనూ నడిపించాడు. గతేడాది అతడు భారత టీ20 జట్టులో సూర్యకు డిప్యూటీగా వ్యవహరించాడు. కెప్టెన్‌గా నియమితుడైన నేపథ్యంలో అక్షర్ స్పందిస్తూ.. 'ఢిల్లీకి సారథ్య బాధ్యతలు చేపట్టడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. నా మీద నమ్మకముంచినందుకు ఫ్రాంచైజీ ఓనర్లు, సహాయక సిబ్బందికి కృతజ్ఞతలు' అని తెలిపాడు.

ఇండియా బుక్ రికార్డ్స్‌లో కాంతిశ్రీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ జిమ్నాస్ట్ అనుపోజు కాంతిశ్రీ ప్రతిష్ఠాత్మక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. 2013 నుంచి 2024 వరకు జరిగిన వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ టోర్నీల్లో అత్యధిక పతకాలు(124) సాధించిన రికార్డును కాంతిశ్రీ సొంతం చేసుకుంది. గత 11 ఏండ్ల వ్యవధిలో ఈ యువ జిమ్నాస్ట్ 75 స్వర్ణాలు సహా, 34 రజతాలు, 15 కాంస్య పతకాలు ఖాతాలో వేసుకుంది. లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన కాంతిశ్రీ భవిష్యత్‌లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నది.

ముగిసిన భారత్ పోరు

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్, గాయత్రి-త్రిసా జోడీ నిష్క్రమణ

బర్మింగ్‌హామ్: బ్యాడ్మింటన్‌లో అత్యంత పురాతన, ప్రతిష్టాత్మక టోర్నీ అయిన ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత్ ఆశలు క్వార్టర్ ఫైనల్‌లోనే అడియాశలయ్యాయి. స్టార్ షట్లర్లంతా ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించినా పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరిన లక్ష్యసేన్‌తో పాటు మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో లక్ష్య.. 10-21, 16-21తో ప్రపంచ ఆరో ర్యాంకర్ లి షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. తొలి గేమ్‌ను 17 నిమిషాల్లోనే గెలుచుకున్న ఫెంగ్ 45 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. ఫెంగ్ జోరు ముందు లక్ష్య తేలిపోయాడు. గాయత్రి-త్రిసా ద్వయం.. 14-21, 10-21తో లి షెంగ్షూ-టన్ నింగ్(చైనా) జోడి చేతిలో ఓటమిపాలైంది.

మరో 7 రోజుల్లో

శ్రీమన్యారెడ్డి డబుల్ ధమాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ నుంచి మరో క్రీడాతార తళుక్కున మెరిసింది. నేవి ముంబై వేదికగా జరిగిన ఏఐటీఏ టోర్నీలో రాష్ట్రానికి చెందిన శ్రీమన్యారెడ్డి రెండు టైటిళ్లతో మెరిసింది. టోర్నీలో డబుల్స్ టైటిల్ గెలిచిన జోరును కొనసాగిస్తూ సింగిల్స్‌లోనూ విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీమన్యారెడ్డి 3-6, 6-4, 6-1తో డానికా ఫెర్నాండోపై అద్భుత విజయం సాధించింది. ప్రత్యర్థికి తొలి సెట్ చేజార్చుకున్న శ్రీమన్య..పుంజుకుని పోటీలోకి వచ్చింది. బలమైన ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లతో మ్యాచ్‌ను తన వశం చేసుకుంది.

ఆరంభ మ్యాచ్‌లకు బుమ్రా దూరం!

ముంబై: ఐపీఎల్-18వ సీజన్ ప్రారంభ మ్యాచ్‌లలో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్‌కు బౌలింగ్ కష్టాలు తప్పేలా లేవు. ఆ జట్టు స్టార్ పేసర్ బుమ్రా ముంబై ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశాలున్నాయి. ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియాతో ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో వెన్నుగాయమై ఇటీవలే కోలుకుంటున్న బుమ్రా.. మరికొద్దిరోజుల పాటు బౌలింగ్ వేయకపోవడమే మంచిదని బీసీసీఐ, ఎన్‌సీఏ అధికారులు సూచించినట్టు తెలుస్తోంది.

లక్నో రాత మారేనా?

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఆగమనమే ఓ సంచలనం. 2022లో లక్నో ఫ్రాంచైజీని ప్రముఖ వ్యాపారవేత్త సంజీవ్ గొయెంకా ఏకంగా రూ. 7,090 కోట్లతో సొంతం చేసుకుని అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. భారీ మొత్తానికి తగ్గట్టుగానే లక్నో కూడా తొలి రెండు సీజన్లలో అంచనాలకు మించి రాణించింది. బంతిని బలంగా బాదే నికోలస్ పూరన్, మార్కస్ స్టోయినిస్ వంటి హార్డ్ హిట్టర్లు.. మాజీ సారథి కేఎల్ రాహుల్, క్వింటన్ డికాక్ నిలకడైన ఆటతీరు.. అయూష్ బదోని, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, కృనాల్ పాండ్యా, మోహ్సిన్ ఖాన్, మయాంక్ యాదవ్ వంటి వర్ధమాన క్రికెటర్ల మెరుపులతో ఆ జట్టు వరుసగా 2022, 2023 సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించి మూడో స్థానంలో నిలిచింది. కానీ 2024లో మాత్రం తడబాటుకు గురై ఏడో స్థానంతో ముగించింది. తమతో పాటే లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన గుజరాత్.. 2022లో టైటిల్ గెలవడంతో పాటు 2023లో ఫైనల్ చేరినా లక్నో మాత్రం రెండు సీజన్లలో టైటిల్‌కు దగ్గరగా వచ్చినా ఆ ముచ్చటను తీర్చుకోలేకపోయింది. ఈ సీజన్‌లో కొత్త కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్యంలో బరిలోకి దిగనున్న లక్నో.. నాలుగో ప్రయత్నంలో అయినా కప్పు కలను నెరవేర్చుకుంటుందేమో చూడాలి.

ఐపీఎల్‌లో లక్నో	
2022, 2023	ప్లేఆఫ్స్
2024	ఏడో స్థానం

బలాలు

ఐపీఎల్ 18 వేలంలో ఎవరూ ఊహించని విధంగా ఏకంగా రూ. 27 కోట్ల రికార్డు ధరతో లక్నోకు సొంతమైన పంత్‌ను ఆ జట్టు సారథిగా నియమించింది. గత మూడు సీజన్ల పాటు నడిపించిన రాహుల్‌ను కాదనుకున్న గొయెంకా.. స్టోయినిస్, కృనాల్, డికాక్, పడిక్కల్ వంటి బ్యాటర్లను వేలానికి వదిలేసి జట్టును ప్రక్షాళన చేశారు. డేవిడ్ మిల్లర్, ఎయిడెన్ మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, పూరన్, పంత్‌తో పాటు బదోని, అబ్దుల్ సమద్ వంటి దేశవాళీ హిట్టర్లతో ఆ జట్టు బ్యాటింగ్ విభాగం దుర్భేద్యంగా ఉంది. ఏ క్షణంలో అయినా మ్యాచ్ గమనాన్ని మార్చగల సామర్థ్యం వీరి సొంతం. సీనియర్లు, జూనియర్లతో సమతూకంగా ఉన్న ఆ జట్టుకు బౌలింగ్‌లో స్పిన్నర్ రవి బిష్ణోయ్ అత్యంత విలువైన ఆస్తి. మిడిల్ ఓవర్లలో భాగస్వామ్యాలను విడదీయడంలో సిద్ధహస్తుడైన బిష్ణోయ్.. స్పిన్‌కు వేగం మిక్స్ చేసి వేసే గూగ్లీలకు ప్రత్యర్థులకు చెమటలు పట్టాల్సిందే. స్పిన్‌కు సహకరించే లక్నో ఏకనా పిచ్‌పై బిష్ణోయ్‌ను ఎదుర్కోవడం బ్యాటర్లకు శక్తికి మించిన పనే.

బలహీనతలు..

బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా కనిపిస్తున్నప్పటికీ కూర్పు విషయంలో లక్నోకు తిప్పలు తప్పకపోవచ్చు. ఇక బిష్ణోయ్ మినహాయిస్తే లక్నో బౌలింగ్ విభాగం బలహీనంగానే ఉందని చెప్పక తప్పదు. ముఖ్యంగా పేసర్లలో ఈ బలహీనత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. యంగ్ స్పీడ్‌గన్ మయాంక్ యాదవ్ గాయం కారణంగా పలు మ్యాచ్‌లకు దూరమవనుండటం లక్నోకు ఎదురుదెబ్బే. అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్, మోహ్సిన్ ఖాన్ ఏ మేరకు సత్తా చాటుతారనే దానిపై ఆ జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

ముంబై X ఢిల్లీ

నేడు డబ్ల్యూపీఎల్-3 ఫైనల్స్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. గత నెలలో మొదలైన ఈ సీజన్‌లో శనివారం టైటిల్ పోరు జరుగనుంది. ఫైనల్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి సీజన్ ఫైనల్‌లో ఇదే ముంబై చేతిలో ఓడిన ఢిల్లీ.. రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జోరు ముందు నిలవలేక చతికిలపడింది. ముచ్చటగా మూడో సారి ఫైనల్ చేరిన మెగ్ లానింగ్ సేన.. మూడో ప్రయత్నంలో అయినా టైటిల్ కలను నెరవేర్చుకుంటుందా? లేక సొంత మైదానంలో ముంబై మళ్లీ కప్పును ఎగరేసుకుపోతుందా? అన్నది నేడు తేలనుంది. ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియంలో ఈ మ్యాచ్ శనివారం రాత్రి 8 గంటలకు మొదలవనుంది.

బలాబలాలు..

బలాబలాల పరంగా చూస్తే ఇరు జట్లూ పటిష్టంగానే ఉన్నాయి. ముంబై తరపున ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న నటాలీ సీవర్ బ్రంట్ (493 పరుగులు, 9 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతోంది. సీవర్‌తో పాటు మరో ఆల్‌రౌండర్ హీలి మాథ్యూస్ (304 రన్స్, 17 వికెట్లు) ముంబై విజయాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఫైనల్‌లోనూ ఈ ఇద్దరూ ఇదే జోరును కొనసాగించాలని ముంబై ఆశిస్తోంది. సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ (236 రన్స్) బ్యాట్‌తో పాటు తన వ్యూహాలతో మైదానంలో ప్రత్యర్థి జట్లను తిప్పలు పెడుతోంది. ఇక స్పిన్నర్ అమెలియా కెర్ (16 వికెట్లు) మరోసారి బ్రబౌర్న్‌లో సత్తా చాటితే ఢిల్లీకి కష్టాలు తప్పవు. ఢిల్లీ కూడా తక్కువేమీ తినలేదు. ఆరంభంలోనే తనదైన దూకుడుతో ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోసే షెఫాలీ వర్మ (300 పరుగులు) మంచి టచ్‌లో ఉండగా కెప్టెన్ మెగ్ లానింగ్ (263 రన్స్), నిలకడగా రాణిస్తోంది. ఈ ఓపెనింగ్ ద్వయాన్ని అడ్డుకోకుంటే ముంబై భారీ మూల్యం చెల్లించక తప్పదు. మిడిలార్డర్‌లో జెమీమా, అన్నాబెల్, జొనాసెన్‌తో పాటు పేస్ ఆల్‌రౌండర్ మరిజన్నె కాప్ వంటి హిట్టర్లు ఢిల్లీ సొంతం. ఢిల్లీ బౌలింగ్ విభాగం కాస్త బలహీనంగా కనిపిస్తున్నా స్పిన్నర్లు ఏ మేరకు రాణిస్తారనే దానిపై క్యాపిటల్స్ విజయం ఆధారపడి ఉంది. బ్యాటింగ్‌తో పాటు స్పిన్‌కు అనుకూలిస్తున్న బ్రబౌర్న్ పిచ్‌పై ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు జరగడం ఖాయంగా కనిపిస్తోంది.